క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



తుని బాప్టిస్ట్ చర్చిలో విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న అమర్ ఫౌండేషన్ ప్రతినిధులు

తుని: రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా స్ఫూర్తితో అమర్ ఫౌండేషన్ అధ్యక్షుడు దల్లి శ్యాంసన్ ఆధ్వర్యంలో ఇంటర్, పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆదివారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. స్థానిక స్కాట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి, కల్వరి ప్రేమ సంఘం ఆవరణలో 250 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. దల్లి అమర్‌నాథ్, పాస్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా కొండరాజులబాబు తీర్థం



రమణయ్యపేటలో కొండరాజులబాబు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుకాణాలు

ఏలేశ్వరం: మండలంలోని రమణయ్యపేటలో కొండరాజులబాబు తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వివిధ దుకాణాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. గ్రామంలోని పలు చోట్ల వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పార్టీలు, విందులు ఏర్పాటు చేసుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

నియోజకవర్గంలో ప్రజా చైతన్య యాత్ర



తంతటి కిరణ్ కుమార్

తుని రూరల్: ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకు వచ్చేందుకు తుని నియోజకవర్గంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించనున్నట్టు బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నియోజకవర్గ నూతన ఇన్‌చార్జి తంతటి కిరణ్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బాక్క పరంజ్యోతి సమక్షంలో శనివారం ఆ పార్టీలో చేరగా తనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పోరాట యోధుడు కాన్షిరాం, యూపీ మాజీ ముఖ్యమంత్రి మాయావతి ఆశయాలకు అనుగుణంగా పార్టీని ప్రజల్లోకి తీసుకు వెళతానన్నారు. బీఎస్పీతోనే దళితులు, బహుజనులు, మైనార్టీలు, బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. దళితులు, బహుజనులు ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉచిత రక్తదాన శిబిరం



కత్తిపూడిలో రక్తదానం చేస్తున్న యువకులు

శంఖవరం: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు యువకులు రక్తదానం చేయడం అభినందనీయమని రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ రామకృష్ణ అన్నారు. మండలంలోని కత్తిపూడి సీతారామా డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. యువకులు స్వచ్ఛందంగా 34 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. బ్లడ్ బ్యాంక్‌లో రక్తం నిల్వలు తక్కువగా ఉన్నందున గ్రామాల్లో ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేయాలని రామకృష్ణ కోరారు. కార్యక్రమంలో వి.ఆదిత్య, ఎస్.శ్రీకాంత్, పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రేపు మహా కుంభాభిషేకం



పాతకొట్టాంలోని సీతారాముల ఆలయం

కోటనందూరు: మండలంలోని పాతకొట్టాంలో వేంచేసిన సీతారామస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త యడ్ల చెల్లారావు ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు సప్తనదీ జలాలతో మహిళలు గ్రామంలో కలశయాత్ర చేస్తారన్నారు. అనంతరం స్వామివారికి వేద పండితులు పంచామృతాభిషేకం, వార్షిక కల్యాణం, ఊరేగింపు నిర్వహిస్తారని తెలిపారు. మండలంలోని భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి



గిడజాంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- రౌతులపూడిలో సచివాలయ కన్వీనర్లతో సమావేశం

రౌతులపూడి: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. రౌతులపూడిలో సచివాలయ కన్వీనర్లతో ఆదివారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి జమీలు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాత్ర కీలకమన్నారు. గ్రామ వలంటీర్ల సాయంతో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ విజయానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

మండలంలోని గిడజాంలో సొసైటీ డైరెక్టర్ బండారు బైరాగి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 50 కుటుంబాలు ఆదివారం కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి వరుపుల సుబ్బారావు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి లక్ష్మీభాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, పార్టీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ, మండల కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఆర్.మూలబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



రౌతులపూడి ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

- ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- గోనేడలో ఆత్మీయ సమావేశం

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని మాజీ మంత్రి, ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని గోనేడలో పార్టీ నేత పలికల గంగరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతిఒక్కరూ లబ్ధిపొందారన్నారు. పార్టీలకు అతీతంగా, అర్హత ఒక్కటే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందిస్తూ ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ యువ నాయకుడు తోట రాంజీ, పార్టీ మండలాధ్యక్షుడు తోట బాబ్జీ, బత్తిన శివరామకృష్ణ, వీరంరెడ్డి గోపాలకృష్ణ, దువ్వా బుజ్జి, ఓలేటి రాజు, తోట అయ్యన్న, అడబాల సుబ్బారాయుడు, పెనగంటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 ప్రిలిమ్స్



సూరంపాలెం ఆదిత్యలో పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో ఆదివారం గ్రూపు-2 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 86 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్టు కళాశాలల క్యాంపస్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. తమ విద్యాసంస్థల్లోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 4676 మంది అభ్యర్థులకు గాను 4051 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్టు తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

బెస్ట్ ఫిజిక్ చాపియన్‌షిప్‌లో విద్యార్థికి గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన రోహిత్

గండేపల్లి: బాడీ బిల్డింగ్, బెస్ట్ ఫిజిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో సూరంపాలెం ఆదిత్య కళాశాల విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కేరళలో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించిన సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్, బెస్ట్ ఫిజిక్ చాంపియన్ షిప్–2024 పోటీల్లో ఆదిత్య విద్యార్థి ఎన్.రోహిత్ పాల్గొని 75 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ పొందాడు. రోహిత్‌ను ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి, కోచ్ డి.సాయికిషోర్ తదితరులు అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

తొండంగి: మండలంలోని ఏవీనగరం గ్రామానికి చెందిన ఏపీఈపీడీసీఎల్ షిఫ్ట్ ఆపరేటర్ కాకడ అబ్రహాం కుమార్తె వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.40 వేలు మంజూరైంది. ఈ చెక్కును గ్రామ సర్పంచ్ కొయ్యా జగదీశ్వరి తన నివాసంలో ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీ, నవీన్‌కుమార్, దుళ్ల చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

తుని: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 1న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకురాలు ఎస్‌కే పద్మ కోరారు. పట్టణంలో ఆదివారం ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 1214ను రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు కోరారు. యూనియన్ నాయకులు వి.అప్పారావు, జె.రాముడు, బి.నూకరాజు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ఏలేశ్వరం: గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని పేరవరంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించేందుకు సచివాలయ వ్యవస్థను ప్రారంభించారన్నారు. అవినీతికి తావులేకుండా సచివాలయ వ్యవస్థ పని చేస్తోందన్నారు. తమ ప్రభుత్వంలో పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. అనంతరం స్థానిక నేతలు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, సర్పంచ్ భేరి వరలక్ష్మీదేవి, భేరీ అరవింద కుమార్, నీరుకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పేరవరంలో ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌ను గజమాలతో సత్కరించిన నేతలు

వైభవంగా సీతారాముల కల్యాణం

గండేపల్లి: మండలంలోని పి.నాయకంపల్లిలో ఆదివారం సీతారాముల కల్యాణం కనులవైకుంఠంగా జరిగింది. తత్వం చారిటబుల్ ట్రస్ట్ ట్రస్ట్ చైర్మన్ పసర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ ఆధ్వర్యంలో పండితులు ఉదయం నుంచి లక్ష్మీగణపతి, దుర్గా, సౌర హోమం, శతరుద్ర పారాయణ, రుద్ర హోమం, నవగ్రహ హోమం, నక్షత్ర హోమం నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. హోమాలు, స్వామివారి కల్యాణంలో నాగ సత్య ప్రభాకర్, చైత్ర, తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యురాలు గీతా మూర్తి, భీమ్ సేన్ మూర్తి దంపతులు పాల్గొన్నారు.

నేడు భవ్య పంచాయతన క్షేత్రం

మండలంలోని పి.నాయకంపల్లిలో భవ్య పంచాయతన క్షేత్రం నిర్మాణానికి సోమవారం తత్వం చారిటబుల్ ట్రస్ట్ ట్రస్ట్ చైర్మన్ పసర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



హోమంలో పాల్గొన్న తెలంగాణ బీజేపీ కార్యవర్గ సభ్యురాలు గీతా మూర్తి

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

తొండంగి: బాధిత కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. తొండంగి గ్రామానికి చెందిన దాకి లోవరాజు కరెంట్ షాక్‌కు గురై గత ఆరు నెలలుగా ఇంటికే పరిమితమయ్యాడు. లోవరాజు దయనీయ స్థితిని గుర్తించిన హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు విరాళాలుగా సేకరించిన రూ.34,250 బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.



లోవరాజు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి

గోకవరం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. గోకవరం ఊర కాలువ సమీపంలో రూ.27 లక్షలతోనూ, తంటికొండ ఎస్సీకాలనీలో రూ.27 లక్షలతో నిర్మించే మంచినీటి ట్యాంక్‌లకు ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, సర్పంచులు కొమరం శ్రావణి, బద్దిరెడ్డి సత్యనారాయణమ్మ, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, నాయకులు దాసరి రమేష్, దాసరి సతీష్, సుంకర వెంకటరమణ, తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), తోలేటి రాంప్రసాద్, బద్దిరెడ్డి అప్పన్నదొర తదితరులు పాల్గొన్నారు.



తంటికొండ ఎస్సీకాలనీలో మంచినీటి ట్యాంక్‌కు శంకుస్థాపన చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



తునిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రసంగిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- తునిలో అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

తుని: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సూచించారు. తుని జీఎన్‌టీ రోడ్డులోని అంబేడ్కర్ సర్కిల్‌లో కౌన్సిలర్ చింతల సునీత ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని మంత్రి రాజా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగంలో తీసుకువచ్చిన సంస్కరణల వలనే దేశం ఐక్యంగా ఉందన్నారు. విజయవాడ బందరు రోడ్డులోని అంబేడ్కర్ స్మృతి వనంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని స్ఫూర్తిగా తీసుకుని తునిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. నాడు భవిష్యత్ తరాల కోసం ఆలోచన చేసి అంబేడ్కర్ తీసుకువచ్చిన చట్టాలు దళితుల అభ్యున్నతికి ఎంతగానో దోహదం చేశాయన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ పదవుల్లో రిజర్వేషన్ వలన ఎంతో మంది ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారన్నారు. యువత అంబేడ్కర్ అడుగుజాడల్లో పయనించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తుని రీజినల్ క్రిస్టియన్ కౌన్సిల్ చైర్మన్ జాన్ ఆనంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, ఎంపీపీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు సూచించారు. మండలంలోని లింగంపర్తిలోని ఆయన ఇంటి వద్ద ఆదివారం సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు చేరవేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ వ్యవస్థకు సమాంతరంగా పార్టీ కన్వీనర్లను నియమించారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటా పర్యటించి గత నాలుగున్నరేళ్లలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వరుపుల సూరిబాబు, అడపా పార్థసారథి, ఓలేటి చంటిబాబు, సామంతుల చిన్నారావు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

సాగునీరు విడుదల చేయాలంటూ ఆందోళన

కిర్లంపూడి: పిఠాపురం మండలానికి చెందిన వెల్దుర్తి, రాయవరం, దొంతమూరు, తిమ్మాపురం గ్రామాలకు సాగునీరు విడుదల చేయాలంటూ రైతులు ఆదివారం ఆందోళన చేపట్టారు. అధికారుల తీరుకు నిరసనగా స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద రైతులు వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అధికారుల అలసత్వంతో ఆయకట్టుకు నీరు సరఫరా కావడం లేదన్నారు. ప్రస్తుతం వరిపొలాలు పొట్ట దశలో ఉన్నాయని, నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



కిర్లంపూడిలో ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



గండేపల్లి పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ నరసింహనాయక్

గండేపల్లి: ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేసి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.నరసింహనాయక్ సూచించారు. గండేపల్లి పీహెచ్‌సీలో ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, ఓపీ సేవలు, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, లాబొరేటరీ, నర్సింగ్ స్టేషన్, ఫార్మసీ సేవలు, రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు రోగులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వైద్యం నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన రోగుల పట్ల సిబ్బంది గౌరవమర్యాదలతో వ్యవహరించాలని డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి సురేంద్ర, సీహెచ్‌వో శర్మ, సూపర్‌వైజర్ చల్లారావు, రూతమ్మ, తదితరులు ఉన్నారు.

రాజపూడి పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

జగ్గంపేట: మండలంలోని రాజుపూడి పీహెచ్‌సీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జె.నరసింహనాయక్ ఆదివారం సందర్శించారు. ఆసుపత్రిలో రికార్డులు, ల్యాబొరేటరీ, రోగుల వార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి పూజ, సిబ్బంది ఉన్నారు.

రహదారి పునర్నిర్మించాలంటూ ధర్నా

గోకవరం: మండలంలోని తంటికొండ రహదారిని పునర్నిర్మించాలని కోరుతూ బీజేపీ నాయకులు ఆదివారం ధర్నా నిర్వహించారు. గోకవరం నుంచి తంటికొండకు వెళ్లే రహదారి అధ్వానంగా మారిందన్నారు. ప్రతి శనివారం తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ రహదారిని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు బత్తుల వెంకన్నబాబు, ప్రధాన కార్యదర్శి ఇనకోటి బాపన్నదొర, సబ్బెళ్ల రామారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆమ్ ఆద్మీ తుని ఇన్‌చార్జిగా లక్ష్మణాచార్యులు

తుని: ఆమ్ ఆద్మీ పార్టీ తుని నియోజకవర్గ ఇన్‌చార్జిగా పమ్మి లక్ష్మణాచార్యులు నియమించామని కాకినాడ జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ నరాల శివ తెలిపారు. తుని కొట్టాం సెంటర్‌లోని జయకృష్ణ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ఆదివారం తుని నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు లక్ష్మణాచార్యులను ఇన్‌చార్జిగా నియమించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.కృష్ణమోహన్, కోశాధికారి ఎన్‌వీఎస్ రామారావు, మూర్తి, జానకీరామయ్య, కామేశ్, వెంకట్రావు, రత్నం పాల్గొన్నారు.



లక్ష్మణాచార్యులకు నియామక పత్రం అందజేస్తున్న శివ

ఘనంగా వెయ్యి పున్నముల నోము

ఏలేశ్వరం: జీవితంలో అరుదుగా జరిగే వెయ్యి పున్నముల నోము పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన నీటి సంఘం మాజీ సభ్యుడు సామంతుల రామన్నకు వెయ్యి పున్నములు నిండడంతో అతని భార్య రూపామణితో కలిసి కుటుంబ సభ్యులు వేడుక నిర్వహించారు. స్థానిక సామంతుల వారి వీధిలోని రామన్న ఇంటి వద్ద కుమారులు సామంతుల శ్రీకృష్ణ, సామంతుల భాస్కరరావు దంపతుల ఆధ్వర్యంలో పురోహితుడు గాథావఝుల సూర్యనారాయణ సారథ్యంలో వెయ్యి పున్నముల నోము నిర్వహించారు. హిందూ సంప్రదాయంలో అరుదుగా నిర్వహించే ఈ నోమును తిలకించేందుకు బంధువులు, స్నేహితులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. నోముకు వచ్చిన వారు రామన్న దంపతుల ఆశీస్సులు పొందారు. అనంతరం విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు అలమండ చలమయ్య, మూది నారాయణస్వామి, సామంతుల హైమావతి, కోరాడ రామలక్ష్మీదేవి పాల్గొన్నారు.



వెయ్యి పున్నముల నోము ఆచరించిన రామన్న దంపతులతో కుటుంబ సభ్యులు